క్లుప్తంగా

వైభవంగా ఓసూరు ఎల్లమ్మ తిరునాల



అలంకరణలో ఓసూరు ఎల్లమ్మ

చిట్వేలి : ఓసూరు ఎల్లమ్మ తిరునాల ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తిరునాల సందర్భంగా మైలపల్లి పంచాయతీలోని 8 గ్రామాలలో గురు, శుక్ర, శని వారాలలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆదివారం ఆలయం వద్ద ఉదయం అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం పందేరపు బండ్ల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరునాలు సందర్భంగా బంధువులు, హితులు, సన్నిహితులతో పంచాయతీలోని 8 గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసి తిరునాళ్లను ప్రశాంతంగా జరిపించారు.

నల్లగంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న నల్ల గంగమ్మ

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఘనంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చిట్వేలి : కేఎస్ అగ్రహారంలో వెలసిన భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గత నెల 30న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో ఆదివారం ఉదయం మోహినీ తిరుక్కోలం, సాయంత్రం గ్రామోత్సవం, రాత్రికి గరుడ సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, పూజారి చెట్లూరు శేఖర్ తెలియజేశారు. ఆదివారం కార్యక్రమానికి చిట్వేలికి చెందిన కరీంబాయి, సాయిరాం, శంకురి, వెంకటేశు, కావేరి, అవినాష్‌తోపాటు మరో 6 మంది ఉభయ దాతలుగా వ్యవహరించారు.

దేవాలయానికి విరాళం అందజేత



నగదును అందజేస్తున్న కొల్లం గంగిరెడ్డి, కుటుంబ సభ్యులు

పుల్లంపేట : వడ్డిపల్లి గ్రామంలో నూతన నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి మాజీ డీసీసీబీ చైర్మన్ కే.శే. కొల్లం బ్రహ్మానంద రెడ్డి జ్ఞాపకార్థం కొల్లం గంగిరెడ్డి కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఆదివారం రూ.5 లక్షల మొత్తాన్ని గ్రామ పెద్దలకు ఇచ్చారు. కాగా మూడు రోజులపాటు నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో పూజారి ప్రసాద్ స్వామి అమ్మవారికి కుంభాభిషేకం, అష్టోత్తర తదితర పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, ఆయన సతీమణి ముద్దా విజయమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ దేవత దేవస్థానం అభివృద్ధికి ప్రొద్దుటూరుకు చెందిన భక్తుడు పసుపుల శశికుమార్ ఆదివారం రూ.20,116లు విరాళం ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజుకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ఈఓ పేర్కొన్నారు. విరాళం అందజేసిన భక్తుడికి, ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అమ్మవారి కృపాకటాక్షములు ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్ ఉడం సుబ్బరాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రయాణం.. గ్రామీణులకు దూరం

- దశాబ్దాలుగా ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేత
- కలగానే దక్షిణభారత దేశ అతిపెద్ద సొరంగ మార్గ ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న రైలు ప్రయాణికులు



ఓబులవారిపల్లె రైల్వే స్టేషన్

ఓబులవారిపల్లె : రైలు ప్రయాణం చేయాలంటే చాల మంది ప్రజలు ఇష్టపడతారు. కరోనా కారణంగా రైల్వే వ్యవస్థ సేవలకు అంతరాయం ఏర్పడింది. కోవిడ్ అనంతరం కొన్ని రైళ్లను రద్దు చేసి కొన్నింటిని మాత్రమే నడిపించారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో రైళ్లు నడుస్తున్నా మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్టాపింగ్ ఎత్తివేశారు. ఉన్న ప్యాసింజర్ రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో గత్యంతరం లేక ప్రజలు బస్సు ప్రయాణం చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేత

రాజంపేట పార్లమెంటు నియోజవర్గంలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు రైల్వేస్టేషన్‌లలో దశాబ్దలుగా స్టాపింగ్ ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను తొలగించారు. దీంతో దూర ప్రాంతలకు రైళ్లలో ప్రయాణించే గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణించాలంటే రేణిగుంట, కడప రైల్వేస్టేషన్‌లకు వెళ్లాల్సి వస్తుంది. రైల్వేను సామాన్య ప్రజలు అందుబాటులోకి తీసుకొచ్చి అభివృద్ధి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం వ్యాపారం, సంపన్న వర్గాల కోసమే రైల్వేలను నిర్వహిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

పేరుకు జంక్షన్.. స్టాపింగ్ నిల్

ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్ పేరుకే జంక్షన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రం ఇక్కడ నిలబడవు. దశాబ్దలుగా రాయలసీమ ఎక్స్‌ప్రెస్, జనతా ఎక్స్‌ప్రెస్‌లు స్టాపింగ్ ఉండేవి. కాలక్రమేనా జనతా ఎక్స్‌ప్రెస్ బదులుగా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, హరిప్రియా ఎక్స్‌ప్రెస్‌లు స్టాపింగ్‌లు ఉండేవి. జంక్షన్ అయితే రైల్వేపరంగా అభివృద్ధి చెందుతుంది. చెన్నై, ముంబాయి, ఢిల్లీ, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలబడతాయనుకొన్న ప్రజలకు చుక్కెదురైంది. కొత్త స్టాపింగ్‌లు దేవుడెరుగు ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించడంతో ప్రజలు కంగుతిన్నారు. ఇదేంటి జంక్షన్ కదా అనుకుంటే రైళ్లే లేకుండా చేశారని అశ్చర్యపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యాన పంటలకు పేరుగాంచిన ఓబులవారిపల్లె ప్రజలు వ్యాపార నిమిత్తం, చదువులకు, గల్ఫ్ దేశాలకు దూర ప్రాంతలకు ప్రతి నిత్యం ప్రయాణలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఓబులవారిపల్లెకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో మండల వాసులు అనుకుంటున్నారు.

కలగానే సొరంగా మార్గంలో నెల్లూరుకు ప్రయాణం..

దశాబ్ద కాలంగా కడప జిల్లా నుంచి నెల్లూరు జిల్లాకు ఓబులవారిపల్లె – కృష్ణపట్నం రైలు మార్గం కోసం రెండు జిల్లాల ప్రజలు ఎదురు చూశారు. ఈ మార్గం 2005–2006 వ సంవత్సరంలో మంజూరైంది. ముందుగా హస్తవరం నుంచి కృష్ణపట్టణానికి రైలు మార్గం సర్వే నిర్వహించగా ఓబులవారిపల్లె నుంచి దూరం తగ్గడంతోపాటు అనుకూలంగా ఉండటంతో ఈ మార్గాన్ని అధికారులు ఖరారు చేశారు. ఈ రైలు మార్గం కోసం ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అప్పట్లో కృషి చేశారు. దక్షిణ భారతదేశంలోనే అతి పొడవైన సొరంగ రైలు మార్గం చిట్వేలి మండలంలో ఉంది. దాదాపు 6.6 కిలోమీటర్‌ల పొడవుతో ఒక టన్నెల్ 1.5 కిలోమీటర్‌ల పొడవుతో రెండవ టన్నెల్ ఏర్పాటు చేశారు. టన్నెల్ మార్గంలో ప్రయాణించాలని రెండు జిల్లాల ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు కూడా ఎంతో ఆసక్తితో ఉన్నారు. అయితే కృష్ణపట్నం, ఓబులవారిపల్లె రైలు మార్గం ప్రధానంగా సరుకు రవాణ కోసం మాత్రమే గూడ్స్ రైళ్లు నడుపుతున్నారు.



కేంద్ర మంత్రికి వినతి ప్రతం అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి (ఫైల్)

ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లు నడిపేందుకు రైల్వే అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సొరంగా మార్గంలో ప్రయాణించాలనే ప్రజల కల కలగానే అసంపూర్తిగానే మిగిలిపోయింది.

కొత్త ప్యాసింజర్ రైళ్ల ఊసేలేదు

ప్రస్తుతం నడుస్తున్న తిరుపతి–హుబ్లీ ఇంటర్ సిటీ ప్యాజింజర్ రైళ్లు ప్రతి రోజు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. అర్కోనం–కడప ప్యాసింజర్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త ప్యాసింజర్ రైళ్ల ఊసేలేదు. నంద్యాల–కడప డెమోను రేణిగుంట వరకు పొడిగిస్తామని నిర్ణయించిన రైల్వే శాఖ అధికారులు ఇప్పటివరకు అమలు చేయలేదు. మండల కేంద్రంలో గతంలో ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌లు పునరుద్ధరించి, మరిన్ని రైళ్లకు స్టాపింగ్‌లు కల్పించి, నూతన ప్యాసింజర్ రైళ్లను ప్రవేశపెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ కల్పించాలి



ఓబులవారిపల్లెలో గతంలో ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలి. నెల్లూరు – కడప ప్యాసింజర్ రైలును నడపాలి. నంద్యాల రైలును రేణిగుంట వరకు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలి. పేరుకు జంక్షన్ రైల్వే పరంగా ఇక్కడ ఎటువంటి అభివృద్ధి లేదు. దశాబ్దలుగా ఉన్న స్టాపింగ్‌లను ఎత్తివేడం దారుణం. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– నందలూరు వెంకటసుబ్బారెడ్డి, పున్నాటివారిపల్లె, ఓబులవారిపల్లె

రైల్వే మంత్రి, డీఆర్ఎం దృష్టికి సమస్యలు



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలిసి ఇటీవలే పార్లమెంటు పరిధిలోని రైల్వే స్టేషన్‌లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని రైల్వేశాఖ మంత్రికి వినతి పత్రం అందజేశాం. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు రైల్వేస్టేషన్‌లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని గుంతకల్లు డీఆర్ఎం, జీఎంలకు పలుమార్లు కోరాం. అయినా స్పందించలేదు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి కారణంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైళ్ల స్టాపింగ్‌కు కల్పించాలి.

– తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, గుంతకల్లు రైల్వేబోర్డు కమిటీ సభ్యులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయండి



జీపుజాతా బృందానికి స్వాగతం పలుకుతున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటి అర్బన్ : మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, గోపి, నాగరాజులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మున్సిపల్ జీపుజాతా ఆదివారం రాయచోటికి చేరుకుంది. ఈ సందర్భంగా రాయచోటి మున్సిపల్ కార్మికులు ప్రచార జాతాలోని నేతలకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి వచ్చాక ఆప్కాస్‌లోకి చేర్చి చేతులు దులుపుకున్నారన్నారు. కార్మికుల జీతాలు పెంచాలని, హెల్త్ రిస్క్ అలవెన్స్‌ను ఇప్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీపుజాతా నేతలు నాగేంద్ర, ముత్యాలరావు, శ్రీనివాసులు, రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, మున్సిపల్ కార్మికులు రాంబాబు, అగ్గి రాముడు, సిద్ధయ్య, మంగమ్మ, వెంకటరమణ, ఓబులేసు, మాధవి, లక్ష్మీదేవి, రమణమ్మ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కార్యకర్తల సమావేశం అనంతరం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నాయకులు

వీరబల్లి (రాయచోటి టౌన్) : అందరం కలసికట్టుగా పని చేసి మరో సారి జగనన్నను సీఎం చేసుకుందామని ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం వీరబల్లె మండలం వంగిమళ్ల కస్పాలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి ఇంటిలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతానికి చేయవల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ బలంగా ఉండాలంటే కార్యకర్తలు కృషి తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్‌రెడ్డి ఇచ్చిన అల్పాహార విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజంపేట సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, పెదివీటి సొసైటీ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, సర్పంచ్‌లు నేతి ఆంజనేయులు, గోపినాథరెడ్డి, గంగులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామరాజు, శ్రీరాముల రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు మేధాశక్తి



మాట్లాడుతున్న అధికారి అమీరుద్దీన్

రామాపురం : జిల్లా గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతం చేయాలని కడప జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రామాపురంలోని శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మే నెల 6వ తేదీ నుండి జూన్ 11వ తేది వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తున్న శాఖా గ్రంథాలయాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు సెలవులు ఇచ్చిన దృష్ట్యా సమయం వృథా కాకుండా ఉండేందుకు స్థానికంగా ఉన్న గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. దీంతో మేధాశక్తి పెంపొందించుకోవడమే కాకుండా సమయం వృథా కాకుండా పుస్తక పఠనం చేసినట్లవుతుందని తెలిపారు. గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదువుకొని ఉన్నత స్థాయి అధిరోహించిన వారు చాలా మంది ఉన్నారన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సూర్యానారాయణరెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు



కంటి అద్దాలు, మందులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కంటివైద్య శిబిరంలో 36 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. శిబిరానికి రాయచోటితో పాటు పీలేరు, వాయల్పాడు, కదిరి, రాజంపేట, కోడూరు, కలికిరి, పులివెందుల తదితర ప్రాంతాల నుంచి 70మంది కంటి రోగులు వచ్చారు. వీరికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 36 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్లు చేయించుకున్న 54 మంది కంటి రోగులకు తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందజేశారు. ఉచిత భోజన వసతిని కల్పించారు.

వికసించిన మే పుష్పాలు

ప్రతి ఏటా మే నెలలో ప్రకృతి ప్రియులను అలరించే మే పుష్పం వికసించింది. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని తంబిళ్ళవారిపల్లెలో పంజం సుధాకర్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఆదివారం మే పుష్పాలు వికసించాయి. ఏడాదిలో ఒక్కసారే వికసించే ఈ ఇవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. – రైల్వేకోడూరు



ఘనంగా వార్షికోత్సవం

రామాపురం : మండలంలో సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో వెలసిన శ్రీ అవధూత నారాయణస్వామి 74వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరు చెందిన వేద పండితులచే ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పూర్ణాహారతి, అభిషేకాలు, హోమాలు జరిపారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవధూతకు పూజలు చేశారు. రాత్రి శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కళా నాట్య మండలి ఆధ్వర్యంలో సానవుల చిన్నమ్మ కథ నాట్య రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

చికాకు పెట్టిస్తున్న ట్రాఫిక్



కడపకు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఏర్పడిన దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. పాత బస్టాండ్ వద్ద కడప వైపు వెళ్లే దారిలో బస్సులు బస్టాండ్‌కు వెళ్లకుండా నడిరోడ్డుపై ఆపుతుండటంతో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పోలీసులు హెచ్చరిక బోర్డులు పెట్టినా నడిరోడ్డు పైనే బస్సులను ఆపుతున్నారు. దీంతో అక్కడే ఆటోలను ఆపి ప్రయాణీకులకు ఎక్కించుకుంటున్నారు. భారీ వాహనాలు వచ్చి పోయేటప్పుడు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ఆటోడ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు అటువైపు వచ్చేటప్పుడు ఆటోలను తీసేస్తున్నా మళ్లీ పోలీసులు వెళ్లగానే ఆటోలను యథాస్థానంలోనే ఉంచుతున్నారు. ఇకపై బస్సులన్నీ బస్టాండ్‌కు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు అభినందనీయం

గాలివీడు : నిరుపేదల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో రాయచోటి భారతి ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ వైద్యం ఖరీదైన తరుణంలో సేవా దృక్పథంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూలివీడు సర్పంచ్ ఉమాపతి రెడ్డి, మైనార్టీ నాయకులు నిజాముద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు జి.శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జేఎన్‌టీయూ వీసీ రాక

కలికిరి : అనంతపురం జేఎన్‌టీయూ వీసీ రంగజనార్ధన్ సోమవారం కలికిరి జేఎన్‌టీయూ కళాశాలకు రానున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.వి. సత్యనారాయణ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కళాశాల ఆడిటోరియంలో అధ్యాపకులు, మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు. అలాగే కళాశాల మెస్ కాంట్రాక్టు కొత్తవారికి ఇవ్వడంతో వీసీ పరిశీలించనున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన దేశాయి మూలస్థానమ్మకు గుండ్లూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున మేళతాళాలు, భాజాబజంత్రీల నడుమ ఊరేగింపుగా బోనాలు మోసి అమ్మవారికి సమర్పించారు. రాత్రి చాందినీ బండ్లు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకిపురం సీఐ క్రిష్ణయ్య, కలికిరి ఎస్ఐ రహీముల్లా ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అగ్రహారం వాసులకు పునరావాసం కల్పించండి



ఏపీఎండీసీ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న సాయికిషోర్‌రెడ్డి, గ్రామస్తులు

ఓబులవారిపల్లె : డెంజర్ జోన్‌లో ఉన్న అగ్రహారం గ్రామాన్ని తరలించి గ్రామస్తులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ కల్పనతోపాటు మెరుగైన పునరావాసం కల్పించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డిని కోరారు. ఆదివారం తిరుపతిలో ఎంపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడిని కలిసిన సాయికిషోర్ రెడ్డి, ఆర్ఆర్‌సెంటర్ – 2 అగ్రహారం గ్రామ ప్రజలకు పునరావసం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రహారం గ్రామ ప్రజలు గనులకు సమీపంలో కాలుష్యం, పేలుళ్లతో ప్రమాదకరమైన పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని వారిని తరలించాలన్నారు. ఇందుకు ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి స్పందిస్తూ ఇప్పటికే గ్రామాల తరలింపునకు భూసేకరణ పనులు పూర్తి చేశామని నెల రోజులో అగ్రహారం ఆర్ఆర్–2కు పునరావసం కల్పించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు వెంటనే పనులు వేగవంతం చేయాలని సీపీఓ సుదర్శన్‌రెడ్డిని ఎండీ ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు ఓరుగంటి నవీన్, ఓరగంటి అనీల్, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, మైనార్టీ నాయకులు కరీముల్లా, పోకూరి మురళి, రాధమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని అందరూ అలవరుచుకోవాలి



గంగమ్మ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, నాయకులు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మను ఆదివారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, అధికారులు, అర్చకులు వేదమంత్రాలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవరచుకోవాలన్నారు. రైతులు సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ బాబు, తదితరులు ఉన్నారు.

గంగమ్మ సన్నిధిలో ఎంపీపీ మద్దిరేవుల

లక్కిరెడ్డిపల్లె : వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండేలా చూడాలని అనంతపురం గంగమ్మ దేవతకు ఆదివారం అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కో – ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న వెంకటరమణ, వెంకటరామిరెడ్డి, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

రమణీయంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గౌనేని వారు ఉభయ దాతలుగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే..

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, ఆమె తనయులు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు ప్రారంభం



మట్టిని తీసే పనులు చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రెడ్డివారిపల్లి హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు కృషితో ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు, భూసేకరణకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. దీంతో బ్రిడ్జి నిర్మాణానికి మట్టి తీసే పనులు చేపట్టారు. త్వరలో నిర్మాణపనులను ప్రభుత్వ విప్ కొరముట్ల పారంభించనున్నారు. ప్రతి ఏడాది వరదలు వచ్చినప్పుడు పాతబ్రిడ్జి ఎదోఒకపక్క కూలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు.

గిరిజన సమాఖ్య మహాసభలను విజయవంతం చేయండి

కేవీపల్లె : ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రాయచోటిలో నిర్వహించనున్న ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సాంబశివ అన్నారు. ఆదివారం మండలంలోని జిల్లేళ్లమంద పెద్దతాండాలో మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా అడవిబిడ్డల ఆక్రందనలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రకృతి సిద్ధ అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లే గిరిజనులపై అటవీ, పోలీస్ అధికారులు కేసులు బనాయిస్తూ జైలుపాలు చేస్తున్నారని పేర్కొన్నారు.